క్లుప్తంగా

ఆటల పోటీలు ప్రారంభం



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి

అమలాపురం టౌన్: స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు క్రీడా స్థలంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి గురువారం ఆటల పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులకు పరుగు, కబడ్డీ, కోకో తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, పీఈటీ కుడుపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రూ.60 వేల విరాళం



తాళ్లరేవులో జరిగిన సేవామహోత్సవంలో మాట్లాడుతున్న బాదం బాలకృష్ణ

తాళ్లరేవు: స్థానిక లయన్స్ క్లబ్‌కు జిల్లా లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ రూ.60 వేలు విరాళంగా అందజేశారు. వల్లిబాబు లయన్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా క్లబ్ నిర్వహించిన సేవా మహోత్సవానికి విచ్చేసిన బాలకృష్ణ క్లబ్ ద్వారా చేస్తున్న సేవలను అభినందించారు. వల్లిబాబు లయన్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు రూ.50 వేలు, బ్రహ్మార్పణ్ భోజన పథకానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, చోడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభం



విలసవిల్లిలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలోని వీవర్స్ కాలనీలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ ఊర్మిళాదేవి కొబ్బరికాయ కొట్టి గురువారం ప్రారంభించారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్న చోట ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు సర్పంచ్ ఊర్మిళాదేవి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, ముత్యాల వెంకటనారాయణ, గెద్దం సాయి, పుత్యల ఏసు, గంపల బున్ని, పిచ్చిక ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పండితులు ఘనంగా రుద్రహోమం నిర్వహించారు. గురువారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే పరమశివుని జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని రుద్రహోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కేశవస్వామి ఆలయంలో దొంతుకుర్రు గ్రామానికి చెందిన భక్తి సుధా గీతాంజలి భజన సమాఖ్య వారిచే భజన కార్యక్రమం గురువారం నిర్వహించారు.

నేడు గరికపాటి ప్రవచనం

మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

4న అన్నసంతర్పణ

తాళ్లరేవు: స్థానిక కేశవపురంలో శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీన భారీ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాస్, పాలక వర్గ సభ్యుల నిర్ణయం మేరకు ఈ నెల 4న అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామన్నారు. భక్తులందరూ తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

తాళ్లరేవు: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి జరగనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు కోరారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ సమాధులు.. చరిత్రకు సాక్ష్యాలు..

- యానాంలో ఫ్రెంచి అధికారుల సమాధులు
- 300 ఏళ్ల చరిత్ర నిక్షిప్తం



యానాంలో ఫ్రెంచి వారి సమాధులు

యానాం: సరిగ్గా మూడు వందల ఏళ్ల క్రితం 1723లో యానాం ఫ్రెంచి పాలనలోకి వెళ్లింది. 1723 నుంచి 1954 వరకు సాగిన ఫ్రెంచిపాలనా కాలంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన అనేకమంది ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం యానాం వచ్చి స్థిరపడ్డారు. ఎంతోమంది ఫ్రెంచివారు వారి జీవితకాలంలో సైనికాధికారులు, ఇంజినీర్లు, నౌకా కెప్టెన్లు, టీచర్లుగా యానాంకు సేవలందించారు. అప్పట్లో వారి మృతదేహాలకు మెట్టకూరు రహదారిలోని యానాం సెమిట్రీలో అంత్యక్రియలు చేయడంతో పాటు అక్కడే వారికి గుర్తుగా సమాధులు సైతం నిర్మించారు. ఆ రోజుల్లో యానాంలో అత్యుత్తమ సేవలందించిన ఫ్రెంచివారి సమాధి ఫలకాలను అధ్యయనం చేసి మైకేల్ గౌదార్ అనే చరిత్రకారుడు 'జీనియాలజీ దిస్ ఫ్యామిలీస్ ది ఫ్రాంకైజ్' అనే గ్రంథాన్ని రాశాడంటే ఆ సమాధుల యొక్క ప్రాధాన్యతను అర్థం చేసుకోవొచ్చు. ఇప్పటికీ ఆ సమాధులపై ఎందరో ఔత్సాహిక చరిత్రకారులు అధ్యయనం చేస్తున్నారు.

సిస్టర్ క్లెయిర్(టీచర్)

సిస్టర్ క్లెయిర్(1820-1850) ఈమె సిస్టర్స్ ఆఫ్ లియోన్‌మిషనరీ నుంచి వచ్చిన సిస్టర్స్‌లో పెద్దది. ఆమె 1820లో తూర్పు ఫ్రాన్స్‌లోని యూజీన్ అనే ప్రాంతంలో జన్మించారు. ఫ్రెంచి నుంచి యానాం వచ్చి స్థిరపడిన ఆమె యానాంలో పెద్ద అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన 3 వేల మందికి చర్చి ప్రాంగణంలో ఆశ్రయమిచ్చి బాధితులకు అనేకవిధాలా సహాయమందించారు. అనంతరం ఆమె చనిపోతే యానాంలోని వందలాది మంది హిందువులు తమ ఆచార వ్యవహారాలను పక్కనపెట్టి అంత్యక్రియల్లో పాల్గొన్నారని 'ఎకో ఆఫ్ మౌంట్ బ్లాంక్' అనే ఫ్రెంచిపత్రిక రాసింది. అదేవిధంగా ఫ్రాన్స్ నుంచి వచ్చిన థెయేఫిల్, సిస్టర్ లూసిల్, సిస్టర్ డెనైస్ సైతం టీచర్లుగా సేవలందించారు.



సిస్టర్‌లు క్లెయిర్, అగస్టిన్, థియేఫిలే, లూసిలి, డెనిష్ సమాధి ఫలకం



జెజె దిలావెనీ చర్చి ఫాదర్ సమాధి ఫలకం

ఫిథోస్ కుటుంబం

ఫామ్‌ఫైల్ ఫిథోస్ తన తండ్రి ఫిథోస్ బాటలో పయనించి యానాంలో మంచి వైద్యునిగా పేరు తెచ్చుకున్నారు. 1824లో కలరా విజృంభించినపుడు 1933 నాటికి తీవ్ర కరవు పరిస్థితులు దాపురించాయి. అప్పట్లో ఫిథోస్ కుటుంబం బాధితులకు నిస్వార్థంగా సేవలందించి అందరి మన్ననలు పొందారు. ఫిథోస్ కుటుంబ ఇంటినే ప్రస్తుతం స్థానిక పరిపాలనాధికారి ఆఫీసు భవనం.

పలువురి అధ్యయనం



ఫ్రెంచి పాలనా కాలంలో వివిధ హోదాల్లో యానాం వచ్చిన ఫ్రెంచి జాతీయులు ఈ ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి తదితర సేవలు అందించారు. ముఖ్యంగా న్యాయసేవలు నిష్పక్షపాతంగా ఉండేవి. యానాం సమాధుల ఫలకాలపై పలువురు అధ్యయనం చేశారు.

– బొల్లోజు బాబా, అధ్యాపకుడు, చరిత్రకారుడు

ఫెర్రీరే అండ్ ఫ్యామిలీ

యానాంలోని సమాధుల్ని గమనిస్తే 1849-1855 మధ్య యానాం పెద్దొరగా పనిచేసిన ఎఫ్ ఫెర్రీవెలరే హగట్ సమాధి కనిపిస్తుంది. ఆయన కుటుంబ సభ్యులైన చార్లెస్ జోసఫ్ ఫెర్రీరే, అమీలీ ఫెర్రీరే టీచర్లుగా పనిచేశారు.

అలాగే యానాంలో విక్టర్ సెమొనల్ పేరుతో ఒక జ్ఞాపికా ఫలకం ఉంది. వెర్దన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి 1917 ఆగస్టు 21న అసువులు బాసిన 21 ఏళ్ల యువ సైనికాధికారి విక్టర్ సెమొనల్. అలాగే యానాం ప్రజలకు సేవలందించిన మైకాట్ ది లొకాంబే(షిప్పుల వ్యాపారి), ఎలియనార్ గైనెట్, మైఖేల్ అల్లార్డ్, పియరీ జేజే దిలావెనీ, పాల్ ఫెల్డ్(జడ్జి), జాకోబస్ మార్టిన్, బార్బరా లెబోన్, జీన్ బాప్టిస్ట్ బోషెజ్, మైఖేల్ లె కాన్నె తదితర ప్రముఖుల సమాధులు ఇక్కడ ఉన్నాయి.

స్విమ్మింగ్‌లో కాంస్య పతకం



స్విమ్మింగ్‌లో కాంస్య పతకం సాధించిన వెంకటేష్

యానాం: గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్‌లో స్విమ్మింగ్ విభాగంలో యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) అకాడమీ క్రీడాకారుడు డి.వెంకటేష్ కాంస్య పతకం సాధించాడని అకాడమీ ఇన్‌చార్జి జి.లింగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రైథలాన్ మిక్స్‌డ్ విభాగం రిలే, మోడల్ పెంథాతలన్ విభాగాల్లోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన వెంకటేష్ మెరుగైన ప్రతిభ కనబరిచాడన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.10,116 విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమం నిమిత్తం పట్టణానికి చెందిన బావిశెట్టి నాగబాబు రూ.10,116 సమకూర్చారు. తన మిత్రుడు అమలాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ విరాళం సమకూర్చానని దాత నాగబాబు తెలిపారు. ఈ మొత్తాన్ని స్వామి సన్నిధిలో ఆలయ అర్చకులకు దాత గురువారం ఉదయం అందజేశారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన డయాలిసిస్ బాధితుడు నాగాబత్తుల ప్రసాద్ అనారోగ్యంతో అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ పందు లిఖిత గురువారం సదరు ఆసుపత్రికి వెళ్లి రూ.10 వేలు డయాలిసిస్ పింఛన్ అందజేసింది. వలంటీర్ లిఖితను సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్ తదితరులు అభినందించారు.



ఆసుపత్రిలో ప్రసాద్ కుటుంబీకులకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లిఖిత

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



అడబాల లక్ష్మి



జంగా తేజస్వి



ఎంపికైన విద్యార్థినులతో భీమనపల్లి పాఠశాల ఉపాధ్యాయులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాలల పీడీలు గొలకోటి ఫణీంద్ర, కామన మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. గొల్లవిల్లి క్లబ్ నుంచి అడబాల లక్ష్మి, జంగా తేజస్వి ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాకినాడలో జరిగిన ఎంపికల్లో వాలీబాల్ అండర్-19 విభాగంలో సత్తా చాటారన్నారు. భీమనపల్లి పాఠశాలలో చదువుతున్న గొలకోటి మహి, కృష్ణతేజలు ఫుట్‌బాల్ అండర్ -17 విభాగంలో ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఆర్‌ఏఓని కలిసిన వ్యవసాయశాఖ డీడీ

యానాం: స్థానిక వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులైన శివసుబ్రహ్మణ్యన్ గురువారం ఆర్ఏఓ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ పంట అధిక దిగుబడికి అవసరమైన మెలకువలను రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారి జోగిరాజు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఏఓ మునిస్వామిని కలిసిన నూతన అగ్రికల్చర్ డీడీ శివసుబ్రహ్మణ్యన్

శివారు గ్రామాలకు రక్షిత మంచి నీరు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కొత్తపాలెం, గొల్లపేట, మొల్లేటిమొగ, చాకలిపేటల్లో గడప గడపకూ..

కాట్రేనికోన: సీఎస్‌ఆర్, జలజీవన్ మిషన్ నిధులతో నియోజకవర్గ పరిధిలోని శివారు గ్రామాలకు సుమారు 70 రక్షిత మంచి నీటిని ట్యాంకులు నిర్మించి ఇంటింటా కుళాయిలు వేయించి మంచి నీటిని అందిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం, గొల్లపేట, మొల్లేటిమొగ, చాకలిపేట గ్రామాల్లో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల మహిళలు మంగళ హారతులు ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న మగసానితిప్పకు 16 కిలోమీటర్ల మేర పైపులైన్ వేసి మంచి నీరు అందించామన్నారు. గొల్లపేట, చాకలిపేట, మొల్లేటిమొగ, కొత్తపాలెం గ్రామస్తులు రక్షిత మంచి నీరు లేక సుమారు 3 కి.మీ. దూరం నుంచి చెలమల నీటిని తెచ్చుకుని తాగేవారని, వారికి ఇంటింటా కుళాయిలు వేయించి రక్షిత మంచి నీటిని అందిస్తున్నామన్నారు. పారదర్శకంగా పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని అందరూ ఆశీర్వదించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేలకిషోర్, సర్పంచ్‌లు మల్లాడి ఏడుకొండలు, నాతి అలివేణి, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, మల్లాడి ఆదినారాయణ, కాటం సత్తిరాజు, నాతి సత్యనారాయణ, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, కాశి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మొల్లేటిమొగలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు హారతులిస్తున్న మహిళలు

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ముమ్మిడివరం: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెం సచివాలయ వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి గ్రామ వార్డు సచివాలయ పరిధిలో వైద్య క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. శిబిరంలో 1, 19, 20 వార్డులకు చెందిన 365 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు, పెన్మత్స చిట్టిరాజు, కౌన్సిలర్లు వాసంశెట్టి కనకదుర్గ, కాంద్రేగుల వెంకట సత్యవతి, బొంతు సత్యశ్రీనివాస్, పెయ్యల చిట్టిబాబు, రెడ్డి శివన్నారాయణ, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



వన్నెచింతలపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. వన్నెచింతలపూడి గ్రామ సచివాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డాక్టర్ శ్రీకాంత్ ప్రారంభించారు. వైద్య విభాగాల పని తీరు రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవింద్‌శెట్టి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నగర పంచాయతీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్

సంక్షిప్తంగా..

వీసీకే పార్టీ కార్యవర్గం ఎంపిక

యానాం: విడుతలై చిరుతైగల్ కచ్(వీసీకే) పార్టీ యానాం నూతన శాఖ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమవలన్ ఆదేశాలు జారీచేశారు. కార్యదర్శిగా మెల్లం శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా మేడపాటి సత్యవెంకటనారాయణ, డిప్యూటీ సెక్రటరీలుగా కొరమాటి జార్జిఆశీర్వాదరావు, మోకా నూకరాజు, పులిదిండి భీమారావు, మీడియా కార్యదర్శిగా కన్నీడి నాగార్జున, మరో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపికయ్యారు.

ఎంపీటీసీ దంపతులకు సత్కారం



ఎంపీటీసీ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా డొక్కా సీతమ్మ పురస్కారం అందుకున్న ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులను చిందాడగరువులో పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. వారు మరెన్నో పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శెట్టిబత్తుల రాజబాబు, ఆకుల బుజ్జి, ఎంపీటీసీలు సత్య ఆదిలక్ష్మి, కోరిమిల్లి రాంబాబు, చిక్కాల సతీష్, నందడి శ్రీనుబాబు, చిక్కం భీముడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఖాదీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఖాదీ వస్త్ర ధారణ, చేనేత కార్మికులకు ప్రోత్సాహం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో ఎం.కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఖాదీ వస్త్రధారణ ఆవశ్యకతను ఆమె వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా విద్యాశాఖ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సెంటాక్ కన్వీనర్‌గా అమన్‌శర్మ

యానాం: మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర కోర్సుల అడ్మిషన్లు నిర్వహించే సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ(సెంటాక్) కన్వీనర్‌గా ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ అమన్‌శర్మను నియమిస్తూ ప్రత్యేక కార్యదర్శి సౌమ్య గురువారం ఆదేశాలు జారీచేశారు. గతంలో ఆయన యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఉన్న సెంటాక్ కోఆర్డినేటర్ రుద్రగౌడ, టీమ్ లీడర్ శివరాజ్‌లను వారి పదవుల నుంచి రిలీవ్ చేశారు. సెంటాక్ కమిటీపై అనేక ఆరోపణలు రావడం, నేషనల్ మెడికల్ కౌన్సిల్ సైతం ప్రథమ సంవత్సర ఎంబీబీఎస్ అడ్మిషన్లు ఆలస్యంపై ప్రశ్నించడం తదితర పరిణామాల నేపథ్యంలో పాత కమిటీని తొలగించారు.

సాయిబాబా పుణ్యతిథి వారోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలోని షిర్డీ సాయిబాబా మందిరంలో బాబా పుణ్యతిథి(మహా సమాధి) వారోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా బాబా విగ్రహం వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించగా భక్తుడు లింగోలు వెంకటేశ్వరరావు రూ.4,100కు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కల్వకొలను వెంకటరమణ, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, నల్లా ప్రసాద్, కల్వకొలను ఉమ, బోణం అప్పారావు, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆట దుస్తుల పంపిణీ



విద్యార్థులకు ఆట దుస్తులు పంపిణీ చేస్తున్న కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నరసాపురం కొవ్వలి పౌండేషన్ అధినేత కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు ఆట దుస్తులను సమకూర్చారు. గ్రామానికి చెందిన ఫౌండేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నిమ్మకాయల గోపాలరావు, నీలిమ దంపతుల ఆధ్వర్యంలో గురువారం 30 మంది విద్యార్థులకు ఆట దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరిని ఆలమూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై ఎల్.శ్రీను కథనం ప్రకారం.. అక్రమంగా సొమ్ము సంపాదించాలనే దురుద్దేశంతో గ్రామానికి చెందిన భార్యాభర్తలు మహిళలను తీసుకువచ్చి, తమ ఇంట్లో గోప్యంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. దీనిపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణకు ఎస్పీ ఎస్.శ్రీధర్ సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, ఎస్సై శ్రీను నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో వ్యభిచార గృహ నిర్వాహకులిద్దరితో పాటు ఒక విటుడిని అరెస్టు చేశారు. ఎస్సై శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరం గ్రామం నందిబొమ్మ సెంటరులో వేంచేసియున్న అభయ ఆంజనేయ స్వామివారి ఆలయ 12వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ఆంజనేయ స్వామి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గంటి హరీష్‌బాలయోగి, లింగోలు పండు, మోటూరి వెంకటేశ్వరరావు తదితరులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

అందరి సహకారంతో బేతాళ ఉత్సవం విజయవంతం

అంబాజీపేట: అందరి సహకారంతో శ్రీ విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవం విజయవంతంగా జరిగిందని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, కార్యదర్శి మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు తదితరులు తెలిపారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్య కుమార్ ఆధ్వర్యాన పటిష్ట బందోబస్తు నిర్వహించారన్నారు. పోలీసు శాఖ నుంచి సహాయ సహకారాలు అందించిన ఎస్సై చైతన్య కుమార్‌ను సంఘ నాయకులు అంబాజీపేటలో గురువారం ఘనంగా సత్కరించారు.



ఎస్సై చైతన్య కుమార్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

రైతులకు రుణాలు అందించేందుకు కార్యాచరణ

మామిడికుదురు: నారియల్ భారత్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలో సభ్యులైన రైతులు ఒక్కొక్కరికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు అందించే దిశగా కార్యాచరణ చేపట్టామని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నయినాల వేణుగోపాల్ తెలిపారు. మామిడికుదురులో గురువారం జరిగిన రైతు సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కంపెనీ ద్వారా రూ.17.50 కోట్ల కురిడీ కొబ్బరి వ్యాపారం చేస్తున్నామన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతుసంఘం ప్రతినిధులు